# వామ్మో వానరాలు..

- జనావాసాల్లో కోతుల బీభత్సం
- ఇబ్బందుల్లో ప్రజలు
- కోతులను నియంత్రించాలని విన్నపం



మామడలో సంచరిస్తున్న కోతులు

మామడ, డిసెంబర్ 13 : అరణ్యాల్లో ఉండాల్సిన వానరాలు జనావాసాల్లో గుంపులు గుంపులు సంచరిస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మామడతోపాటు పొన్కల్, కొరిటికల్, దిమ్మదుర్తి, న్యూసాంగ్వీ, అనంతపేట, పోతారం తదితర గ్రామాల్లో కోతులు ప్రజలను భయబ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఇళ్లలోకి ప్రవేశించి వంట పాత్రలు, ఆహార పదార్థాలను ఎత్తుకెళ్తున్నాయి. పిల్లలు, మహిళలను గాయపరుస్తున్నాయి. కోతులకు భయపడి ఇళ్ల వద్ద గృహిణులు ఒంటరిగా ఉండాలంటే భయపడుతున్నారు. ఇంటి తలుపులు తీసి ఉంచితే ఇక అంతే సంగతులు. ఇంట్లో ఉన్న సరుకులు మాయమవుతున్నాయి. ఇంట్లో, పెరట్లో పెంచుకునే పండ్ల, పూల మొక్కలను నాశనం చేస్తున్నాయి. తోపుడు బండ్లపై, వార సంతల్లో కూరగాయాలు, పండ్లు విక్రయించే చిరు వ్యాపారుల పరిస్థితి కూడా దారుణంగా ఉంది. ఇళ్లలో పెంచుకున్న పండ్లు,కూరగాయల మొక్కల ను పీకేస్తుండడం.. ఇళ్లలో ఉన్న వారిపై దాడి చేస్తూ గాయపరుస్తున్నాయి. కోతుల నివారణకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

**పంట పొలాలపై..**

వ్యవసాయ బావుల వద్ద సైతం కోతుల బెడద తీవ్రంగా ఉందని సాగుచేసిన పంటలపై కోతుల గుంపు దాడిచేసి నష్టపరుస్తున్నాయని రైతులు వాపోతున్నారు. కూరగాయలు సాగు చేసే రైతులు కోతుల వల్ల ఆ పంటలు సాగుచేయలేని పరిస్థితి నెలకొంది. గతంలో ఎన్నో సార్లు అటవీ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

**కోతులను నియంత్రించాలి..**



గ్రామాలు, పంట చేన్లల్లో కోతుల బెడద ఎక్కువగా ఉంది. కోతులు పెద్ద సంఖ్యలో వచ్చి పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కోల్పో వాల్సి వస్తుంది. అటవీ అధికారులు స్పందించి కోతులను పట్టుకునేందుకు చర్యలు తీసుకోవాలి.

**- సిలివేరి భోజన్న(పొన్కల్)**



సోన్ : ఏవోవసంత్‌రావుకు వివరాలను అందజేస్తున్న రైతులు

## రైతుబంధు కోసం వివరాలను అందజేయాలి

సోన్, డిసెంబర్ 13 : రైతుబంధు కోసం రైతులు వివరాలను అందజేసి సద్వినియోగం చేసుకోవాలని నిర్మల్ మండల వ్యవసాయశాఖ అధికారి వసంత్‌రావు పేర్కొన్నారు. మండలంలోని ఆయా క్లస్టర్ల పరిధిలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కొత్తగా పట్టాదారుపాసుపుస్తకం పొందిన రైతులు బుధవారం నిర్మల్ మండలశాఖాధికారికి వివిధ గ్రామాల రైతులు వివరాలను అందజేశారు. ఏఈవోలు హర్షిత, శ్రావ్య, రాకేశ్ పాల్గొన్నారు.

**గొల్లమాడలో..**

నర్సాపూర్(జీ), డిసెంబర్ 13 : గొల్లమాడ గ్రామంలో కొత్తగా పట్టా పాస్‌బుక్కులు తీసుకున్న రైతుల నుంచి రైతుబంధు కోసం దరఖాస్తులను ఏఈవో గణేశ్ స్వీకరించారు. రైతులు తమ పట్టా పాస్ బుక్, ధరఖాస్తు ఫారం, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ కాపీలను తీసుకురావాలని ఆయన సూచించారు. చాక్‌పల్లి గ్రామంలో నూతన రైతుబంధు దరఖాస్తులను ఏవో సాయికిరణ్ స్వీకరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రమ్య, రైతులు మోహన్ రెడ్డి, ఉత్తమ్ కృష్ణ పాల్గొన్నారు.



నర్సాపూర్(జీ) : పత్రాలు స్వీకరిస్తున్న ఏఈవో

## నిర్మల్ జిల్లా బాక్సర్ అద్భుత ప్రదర్శన



ప్రతిభ చాటిన బాక్సర్స్‌ను అభినందిస్తున్న అధికారులు

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 13 : మంచిర్యాలలో జరిగిన జోనల్ స్థాయి ఎస్జీఎఫ్ అండర్ 14 అండర్ 17 బాల బాలికల ఎస్జీఎఫ్ బాక్సర్ పోటీల్లో నిర్మల్ జిల్లా బాక్సర్లు ప్రతిభ చూపారు. అండర్ 17 బాలికల విభాగంలో ఎల్ సుజల, సీహెచ్ నక్షత్ర బంగారు పతకాలు, జ్యోతి సౌజన్య, ఆర్ అనన్య, బీ హర్షిణి, ఎస్ వనజ, వీఅన సూయ, ఆరుగురు కాంస్య పతకాలు సాధించారు. అండర్ 19 విభాగంలో అర్చన ప్రతిభ చూపి బంగారు బతుకమ్మ సాధించింది. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ప్రతిభ చూపిన బాక్సర్ల ను డీఈవో రవీందర్‌రెడ్డి, మంచిర్యాల జిల్లా డీవైఎస్వో శ్రీకాంత్, జిల్లా బాక్సింగ్ కార్యదర్శి చందుల స్వామి, ఎస్జీఎఫ్ కార్యదర్శి రామారావు, సెక్టోరియల్ అధికారి శ్రీదేవి, బాక్సింగ్ అధ్యక్షుడు బండారి శ్రీధర్, శ్రీకాంత్, మనీషా అభినందించారు.



మాట్లాడుతున్న వరల్డ్ విజన్ సంస్థ మేనేజర్ బ్రహ్మన్న

## పోషకాహార లోపాన్ని నివారించేందుకు కృషి

లక్ష్మణచాంద, డిసెంబర్ 13 : ఫ్రంట్‌లైన్ వర్కర్లు, వారి పిల్లలో పోషకాహారలోపాన్ని తొలగించేందుకు తమ సంస్థ కృషి చేస్తుందని వరల్డ్ విజన్ సంస్థ మేనేజర్ బ్రహ్మన్న పేర్కొన్నారు. బుధవారం వడ్యాల్ రైతువేదికలో పోషకాహార లోపం, ప్రీప్రైమరీ విద్యపై మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. దీనికి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రత్యూష హాజరై పోషకవిలువలతో కూడిన ఆహారంపై వారికి అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారంతోపాటు, పోషక విలువలతో కూడిన ఆహారంపై అవగాహన కల్పించాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా బ్రహ్మన్న మాట్లాడుతూ ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు పోషకాహార లోపాలను తొలగించడానికి కృషి చేస్తున్నాయని తెలిపారు. వరల్డ్ విజన్ కోఆర్డినేటర్ కరుణాకర్, హనుమన్న, ఆయా గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## పది కిలోల గడ్డ తొలగింపు

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 13 : కౌట్ల (బీ) గ్రామానికి చెందిన 35 సంవత్సరాల మహిళ కడుపులోంచి పది కిలోల గడ్డను ఆపరేషన్ ద్వారా తొలగించి ప్రాణాలను కాపాడారు స్వప్న దవాఖాన వైద్యులు. వివరాలు ఇలా ఉన్నాయి. కొన్నేళ్లుగా మహిళ కడుపు నొప్పితో బాధపడుతున్నది. నొప్పితో మంగళవారం నిర్మల్‌లోని స్వప్న మల్టిస్పెషాలిటీ దవాఖానకు వచ్చారు. ఆమెను పరీక్షించిన వైద్యులు నాలం శశికాంత్ (ఎంఎస్ సర్జన్) స్కానింగ్ ఆధారంగా కడుపులో అతిపెద్ద గడ్డ ఉందని గుర్తించారు. బుధవారం వైద్యులు శశికాంత్, గిరీశ్ ఆపరేషన్‌ను పూర్తి చేసి కడుపులో నుంచి 10 కిలోల గడ్డను తొలగించి యువతి ప్రాణాలను కాపాడారు. కుటుంబ సభ్యులు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

## రేపు గణిత ప్రతిభ పోటీలు

సోన్, డిసెంబర్ 13 : ఈ నెల 15న గణిత ప్రతిభ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలంగాణ గణిత ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు చట్ల శ్రీనివాస్, మనోహారెడ్డి తెలిపారు. గణిత మేధావి శ్రీనివాస రామనుజన్ జయంతిని పురస్కరించుకొని పదో తరగతి విద్యార్థులకు మండలస్థాయిలో ప్రతిభ పోటీలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ మీడియం పోటీల్లో పాల్గొనాలని తెలిపారు. మండలస్థాయిలో ఎంపికైన వారికి ఈనెల 19న జిల్లాస్థాయిలో పోటీలు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## మొక్కలు ఎండిపోకుండా చూసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీపీ బర్ల మానస హరీశ్‌రెడ్డి

సోన్, డిసెంబర్ 13 : ప్రతి గ్రామంలోని నాటిన మొక్కలు ఎండిపోకుండా చూసుకోవాలని సోన్ ఎంపీపీ బర్ల మానస హరీశ్‌రెడ్డి అన్నారు. బుధవారం సోన్ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ప్రతి బుధవారం గ్రామ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మొక్కలు ఎండిపోకుండా చూసుకోవాలని, రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్‌రెడ్డి, ఎంపీవో కలీం, ఏపీవో మంజుల, గ్రామ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మహాలక్ష్మి పథకాన్ని రద్దు చేయాలి

సారంగాపూర్, నవంబర్ 13 : మండలంలోని స్వర్ణ గ్రామంలో మహాలక్ష్మి పథకాన్ని రద్దు చేయాలని బుదవారం ఆటోడ్రైవర్లు ధర్నా చేపట్టారు. నిర్మల్–సారంగాపూర్ రహదారిపై ఆటోడ్రైవర్లు ఆటోలను రోడ్డుపై పెట్టి ధర్నా చేయడంతో వాహనాలు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. ఈ సందర్భంగా ఆటోడ్రైవర్లు మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం ఉచిత బస్సులను నడపడం వల్ల తాము ఉపాధి కోల్పోయాని, పూట గడవడం కష్టంగా మారిందని పేర్కొన్నారు. దీంతో తమ కుటుంబాలు రోడ్డున పడే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే ఉచిత బస్సులను బంద్ చేయాలన్నారు. లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతా మన్నారు. ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న ఆటో డ్రైవర్లు

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిర్మల్ టౌన్, డిసెంబర్ 13 : నిర్మల్‌లోని కురన్నాపేట్ 11కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల దృష్ట్యా గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీ రమేశ్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మరమ్మతు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కురన్నాపేట్, శేకసాపేట్, వెంకటాద్రిపేట్, కాల్వగడ్డ, గుల్జార్‌మార్కెట్, బాలాజీవాడలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించాలన్నారు.